# కొండమీద పెళ్ళి

సి.యస్. రావు

పరుగెత్తే మేఘాలకు అడ్డుతగిలే ఎత్తైన కొండమీద ఓ దేవుడు. సాటి దేవుళ్ళందరిలోకీ పలుకుబడి గల దేవుడు. ఆ దేవుడికి నిత్యకల్యాణం పచ్చతోరణం. నిత్యమూ వేలాది యాత్రికులు వస్తూపోతూ వుంటారు. వచ్చే భక్తుల్లో రకరకాల జనం. భక్తి కొందరికీ భయం కొందరికీ. వచ్చే భక్తుల్లో-దొంగతనం బయటపడకుండా కాపాడమని మొక్కుకున్నవాళ్ళు, పదవి నిలబెట్టమని పాకులాడేవాళ్ళు - పదవి కట్టబెట్టమని ప్రాధేయపడేవాళ్ళు, నల్ల డబ్బువాళ్ళు, జూదగాళ్ళు-పేదవాళ్ళు-పతితలు భ్రష్టులు-నిజమైన భక్తులు-రకరకాల జనం. ఎవ్వరినీ రావద్దనీ అనడు, వచ్చినవాడు యిచ్చిన ముడుపుని కాదనీ అనడు ఆ కొండమీది దేవుడు.

లగ్గసరి సీజనులో ఆ కొండ మరీ హడావిడిగా వుంటుంది. మారుమూల గ్రామాలనుంచీ, పట్టణాలనుంచీ కూడ, పేదాసాదా కూడా ఆ దైవసాన్నిధ్యంలో పెళ్ళిళ్లు జరుపుకునేందుకు తండోపతండాలుగావస్తారు. కల్యాణమండపంలో బారులుతీరి కూర్చున్న నూతన వధూవరుల్ని చూస్తూవుంటే దూరానికి ఎవరి వధువు ఎవరో చెప్పడం కష్టం. ఆ సామూహిక వివాహాలు చూడాలేగాని చెప్పనలవికాదు.


ఆ దైవసాన్నిధ్యంలో వివాహం జరిగితే ఆ దంపతులు పదికాలాలపాటు హాయిగా వుంటారనో, ఆ యిల్లాలికి కలకాలం పసుపుకుంకుమలు వుంటాయనో, ఆ దంపతులిద్దరూ పిల్లాపాపలతో సంసార జీవితాన్ని పండు వెన్నెల్లా సాగిస్తారనో, గుట్టు ఆ దేవుడు కడుపులో దాచుకుని అక్కడ ముడిపడిన దంపతుల జీవితాన్ని మూడుపువ్వులూ ఆరుకాయలుగా ఆ దేవుడే సాగనిస్తాడనో -ఏవేవో నమ్మకాలతో జనం అక్కడికి చేరతారు. వివాహాలు జరుపుకుంటారు. కాని చిత్రమేమిటంటే-ఆ కొండమీద ఆ దేవుని ఎదుట జరిగిన వివాహాల్లో కూడా ఎన్నో తికమకలూ - అనుకోని అవాంతరాలూను.

ఆ కొండమీద పెళ్ళి జరిగినా నెల తిరక్కుండానే వితంతువులైన వధువులూ వున్నారు, బిడ్డాపాపలు లేని గొడ్రాళ్ళూ వున్నారు, తగాదాలుపడి విడిపోయిన దంపతులూ వున్నారు, భర్త వదిలేసిన భార్యలూ వున్నారు, భార్య లేచిపోయిన భర్తలూ వున్నారు. నెల తిరక్కుండానే మరో పిల్ల మెడలో ఆ దేవుని ఎదుటే తాళికట్టిన పెళ్ళికొడుకులూ వున్నారు—అయినా అను నిత్యం వేలాది పెళ్ళిళ్ళు కొండమీద జరుగుతూనే వుంటాయి. జనానికి ఆ దేవుడిమీద నమ్మకం అలాంటిది.

బంగారయ్య ముగ్గురు ఆడపిల్లల తండ్రి. ఆఖరికూతురు సుజాత పెళ్ళి ఆ కొండమీద జరిపించడానికి రైలు ప్రయాణంచేసి, మొగపెళ్ళివారితోసహా మధ్యాహ్నం మూడుగంటలకు ఆ వూరు చేరుకున్నాడు. సుజాత పెళ్ళి ఆ దేవుడి సన్నిధిలో జరిపించాలని ఏ నాడూ అనుకోలేదు బంగారయ్య. మొగపెళ్ళివారి తరపువారు పెళ్ళి ఆ కొండమీద జరిపించాలని పట్టుపట్టారు. పెళ్ళికొడుకు నాయనమ్మకు జబ్బుచేసినప్పుడు, తాను బతికి బట్టకడితే మనవడి పెళ్ళి ఆ కొండమీద జరిపిస్తానని మొక్కుకుందట. ఆ మొక్కు తీర్చడంకోసం సుజాత పెళ్ళి ఆ కొండమీద జరిపించాల్సి వచ్చింది. అంత ఖర్చు భరించే స్తోమత బంగారయ్యకు లేకపోయినా, ఆఖరి కూతురుగా బట్టి-ఈ పెళ్ళికాస్తా ఎల్లాగోలా జరిపించేస్తే తన గుండెలమీద కుంపటి దింపుకున్నట్టవుతుందని ఒప్పుకున్నాడు బంగారయ్య.

వియ్యాలవారిని వెంటబెట్టుకొని పెళ్ళి రేపనగా ఓ రోజు మధ్యాహ్నపు వేళకి రైలు దిగి—ఓ సత్రంలో బసచేసాడు బంగారయ్య తన బంధువులతోటీ మొగపెళ్ళివారితోనూ కలసి.

ఆ రోజు సాయంత్రం చల్లబడ్డాక సుజాత సత్రపు గుమ్మంలో ముస్తాబై నిలబడి వీధిన వచ్చేపోయే జనాన్నిచూస్తూ నిలబడింది. సుజాతను వాళ్ళ వూళ్ళోనే పెళ్ళికూతురి చేసారు. పెళ్ళికూతురు ముస్తాబులో సత్రపు గుమ్మంలో నిలబడిన సుజాత అప్పుడే విరిసిన ముద్దబంతిపువ్వులా వుంది. ఆమె పెదవులమీద చిరునవ్వులు తొణికిస లాడుతున్నాయి. రేపే ఆ మూడుముళ్ళూ



పడ్డాక తనకు దొరకబోయే తీయని అనుభూతులనే తలుచుకొని నవ్వుకుంటుందో, త్వరలో తాను చవి చూడబోయే దాంపత్య జీవితం గురించి కలలే గంటోందోగాని సుజాత తనలో తాను నవ్వుకుంటూ నిలబడింది,ద్వారానికి ఆనుకుని.

ఆపరంజి బొమ్మలా చిరునవ్వుల జాలులా నిలబడిన సుజాతను ఎదురుగా కిళ్ళీ కొట్టుమీద కూర్చున్న కొండలరావు చూసాడు కొండలరావు ఆ కిళ్ళీకొట్టు యజమాని కాదు. పనీపాటా లేకుండా వచ్చేపోయే యాత్రికుల్ని చూస్తూ ఆ కిళ్ళీ కొట్టుమీద కూర్చుని కాలక్షేపం చేసే ఓ పెద్దింటి అబ్బాయి. సిల్కు-చొక్కా, గ్లాస్కో పంచి లుంగీ, చేతికి వాచీ. వేళ్లకి వుంగరాలు, వుంగరాలజుట్టు, పల్చని పెదవులు – పెదవులమధ్య గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్టు-చేతిలో సిగరెట్టుపెట్టి అగ్గిపెట్టి-భుజాన ఖరీదైన రంగు రుమాలు—కొండలరావు సాధారణ వేషం. చూసిన వాళ్ళకి అతనేమిటో అర్థమయ్యే వేషం. సుజాత అతని కళ్ళపడింది. సుజాత దృష్టిని తనవైపు తిప్పుకోవడానికి కొండలావు కాస్త గట్టిగా మాట్లాడడం మొదలుపెట్టాడు. సుజాత ఈ లోకంలో లేకపోవడంతో అతన్ని పట్టించుకోలేదు. చివరకు ఈలపాట మొదలుపెట్టాడతను. సుజాత అనుకోకుండా అటు చూసింది. అతను ఆమె చూపులతో చూపులు కలిపి కళ్ళతోటే పిలిచాడు.

సుజాత గుండె ఝల్లుమంది. లోపలికి వెళ్ళిపోయింది. కొండలరావు నవ్వుకున్నాడు. ఇదంతా గమనిస్తోన్న కిళ్ళీకొట్టువాడు 'గేలం వేసేసారా బాబూ!' అన్నాడు నవ్వుతూ. 'నీ పని నువ్వు చూసుకోరా సన్నాసి. నా గొడవ నీ కెందుకు' అని మృదువుగా మందలించాడు కొండలరావు.

వీధి దీపాలు వెలిగాయి. రోడ్డుమీద రద్దీ కాస్త పెరిగింది. చీకటి వెలుగులు కలియబడుతున్నాయి. కొండలరావు కాలం గడవక తొందరపడుతున్నాడు. ఒకటిరెండు సార్లు లేచి అటూ యిటూ తిరిగి హోటలుకి వెళ్ళి కాఫీ తాగి వచ్చాడు.

కొండలరావు ఆ కిళ్ళీకొట్టుమీద కూర్చోవడం కిళ్ళీకొట్టు ఆసామీకి ఇష్టం వుండదు. అతను అక్కడ కూర్చుంటే వచ్చే బేరాలు పోతాయని కిళ్ళీకొట్టు వాడికి తెలుసు. అయినా అతన్ని తన కొట్టుమీద కూర్చోవద్దనే దమ్ము వాడికి లేదు. వాడికే కాదు ఆ వూళ్ళో ఎవరికీ కొండలరావుని ఏమీ అనగలిగే దమ్ముల్లేవు. కొండలరావు మామూలు మనిషికాదు.

పట్టాభిరామయ్యగారి మేనల్లుడూ కాబోయే అల్లుడూ కూడాను పట్టాభిరామయ్య అంటే మామూలు మనిషికాదు. దేవుళ్ళందరిలోకి ఆ కొండ మీద దేవుడికి ఎంత పలుకుబడివుందో ఆ

ప్రాంతం జనం అందరిలోకి పట్టాభిరామయ్యకి అంత పలుకుబడివుంది. దూరప్రాంతాల జనం ఆ దేవుడి దగ్గరకు వరాలకోసం, మొక్కుబడులు చెల్లించడం కోసం వస్తారుగాని, ఆ ప్రాంతం జనం సరాసరి పట్టాభిరామయ్యనే వరాలు అడుగుతారు, మొక్కుబడులు ఆయనే చెల్లిస్తారు. ఆ ప్రాంతంవాళ్ళకి అతనే ప్రత్యక్ష దైవం. ఆ ప్రాంతానికి అతనే మకుటంలేని మహారాజు. పదవీ పలుకుబడీ, అర్థబలం అంగబలం గల పెద్దమనిషి పట్టాభిరామయ్య. అతన్ని ఎవరు కాదంటారు ?, అతన్ని ఎవరు ఎదిరిస్తారు. అతని మేనల్లుణ్ణి—అతనికి కాబోయే అల్లుడ్నీ ఎవరు వేలెత్తిచూప గలరు ?

కొండలరావు పట్టాభిరామయ్య యింట్లోనే వుంటాడు. కొడుకైనా అల్లుడైనా అతనే. పిల్ల చిన్నది కావడంతో యింకా పెళ్ళి జరగలేదు. అందుకే కొండలరావుకి స్వేచ్ఛ. పట్టాభిరామయ్య కూడా చూసీ చూడనట్టు వూరుకుంటాడు కొండలరావు చేష్టల్ని.

రాత్రి పన్నెండు గంటలయ్యింది. కిళ్ళీకొట్టువాడికి రెండో ఆట విడిచిపెట్టే దాకా కొట్టు తెరచివుంచడం అలవాటు. కాని ఆ రోజున కొండలరావు మాటమీద త్వరగా కట్టేసాడు కొట్టు.

వీధిలో జనం రద్దీ తగ్గింది. ముసలి బీటు కానిస్టేబుల్స్‌లా వీధి దీపాలు కునిపాట్లు పడుతున్నాయి. కొండలరావు నెమ్మదిగా సత్రపు గుమ్మందాటి హాలు లోకివెళ్ళాడు. దూరప్రాంతాలనుంచి వచ్చిన యాత్రికులు ప్రయాణంచేసి అలసిపోయి వరండాల్లో బారులుతీరి మత్తుగా గుర్రుపట్టి నిద్రపోతున్నారు.

బంగారయ్య – బంధువులు కూడా మరోపక్క అలసి నిద్రపోతున్నారు. సత్రవు అంతా నిశ్శబ్దంగా వుంది.

కొండలరావు అడుగులో అడుగు



వేసుకుంటూ జనాన్ని పరిశీలనగా చూస్తున్నాడు. సుజాత అతని కంట పడింది. ఎడమచేతి పక్క గదిలో పడుకున్న సుజాత. కొండలరావు జాగ్రత్తగా చూశాడు.

సత్రపు వరండాలో వెలుగుతున్న ఒకే ఒక బల్బు ఆరిపోయింది. సత్రవు అంతా చీకటి. అగ్గిపుల్ల వెలుగులో కొండలరావు సుజాతను చేరుకున్నాడు.

సుజాతకు ఒక్క క్షణం వూపిరాడ లేదు. ఏదో పులి తనమీద విరుచుకు పడినట్టు అనిపించింది. గొంతు ఎండి

లేదు. భయంతో గుండె ఆగిపోయినట్టనపించింది. చివరికి శక్తినంతా కూడగట్టుకొని కెవ్వున అరచింది. జనం అంతా లేచారు. 'దొంగ దొంగ' అని అరవడం మొదలుపెట్టారు. అంతా గందరగోళం – వెర్రికేకలు – అరుపులు –గదిలోనుంచి వస్తున్న కొండలరావుని గట్టిగా ఎవరో పట్టుకున్నారు. ఇంతలో లైటు వెలిగింది.

కొత్తమనిషి కొండలరావుని చూసి 'తన్నండి, కొట్టండి' అన్నారు జనం. సత్రపు గుమాస్తా – పనివాళ్ళు ఒక్క పరుగునవచ్చి, కొండలరావుని చూసి– వాళ్ళచేతుల్లోంచి అతన్ని విడిపించారు.

సత్రపు గుమాస్తా, 'ఎవరనుకున్నారాయన. పట్టాభిరామయ్యగారి మేనల్లుడు. ఆయన వంటిమీద చెయ్యి పడితే ఈ వూరునుంచి వెళ్లేవి మీ శవాలే. జాగ్రత్త' అని గర్జించి 'మీరు వెళ్ళండి బాబూ' అని అతన్ని పంపించేసాడు.

పోతూపోతూ కొండలరావు సుజాతను ఓరగా చూసి మేకను తృప్తిగా తిని సజావుగా వెళ్ళిపోయే పులిలా నడిచి వెళ్లిపోయాడు.

సుజాత తన కాళ్ళమీద ముఖాన్ని మోపి వెక్కి–వెక్కి ఏడుస్తోంది. అందరూ ముఖాముఖాలు చూసుకున్నారు.

'వస్తువులేమైనా పోయాయేమో చూడండి !' అన్నాడు బంగారయ్యకు కాబోయే వియ్యంకుడు సుబ్బారాయుడు.

'వచ్చినవాడు దొంగకాదు లేవయ్యా సుబ్బారాయుడూ. వచ్చిన పని చూసుకున్నాడు. వెళ్ళాడు' అన్నాడు, మొగపెళ్ళివాళ్ళలోని ఓ పెద్దమనిషి సుజాతను ఓరగా చూస్తూ.

బంగారయ్య అతని భార్య శాంతమ్మా తెల్లబోయారు ఆ మాటలకి.

గుసగుసలు బయలుదేరాయి. సుజాత వెక్కి–వెక్కి ఏడుస్తూనే వుంది. మొగపెళ్ళివారంతా ఓ పక్క గుమిగూడి మీటింగు పెట్టుకున్నారు. ఆడపెళ్లివారు గుసగుసలాడుతూ దవడలు నొక్కుకుంటున్నారు.

మొగపెళ్ళివారిలో ఓ ఆసామీ 'ఆ ముసలమ్మ మనుమడిపెళ్ళి కొండమీద జరగాలని మొక్కుకో బట్టి యిలాంటి కులట మన యింటికోడలు కాకుండా తప్పిపోయింది. పొద్దున్నే తిరుగు రైలు ఏముందో చూడండి. ఇక చాలు'అన్నాడు తుది నిర్ణయంగా.

ఆ మాటలు సుజాత చెవినిపడ్డాయి. బంగారయ్య గుండె ఆగిపోయినంత పనైంది. ఏం చేయడానికి పాలుపోవడం లేదు.

బంగారయ్య భార్య శాంతమ్మ 'నా కడుపున చెడపుట్టావు కదే. నువ్వు పుట్టగానే పోయినా యీ కొంపకింత అప్రతిష్ట జరిగేదికాదే' అని సుజాత నెత్తిమీద అక్షింతలువేసి పెళ్ళికూతుర్ని చేసిన చేత్తోనే మొట్టింది.

బంగారయ్య వియ్యంకుడు సుబ్బారాయుడు దగ్గరకు వెళ్ళి 'బావా' అన్నాడు ఏదో చెప్పబోయి.

'ఇంక ఆ మాట అనకయ్యా' అన్నాడు సుబ్బారాయుడు కటువుగా.

'అదికాదు సుబ్బారాయుడూ! పోలీసు స్టేషనుకి వెళ్ళి జరిగింది చెప్పి కేసు పెడదాం తోడురాకూస్త' అన్నాడు ప్రాథేయపూర్వకంగా బంగారయ్య.

'ఇంకా కేసులూ అవీ దేనికి. పరువు బజారునపడ్డానికి కాకపోతేను. మమ్మల్ని యింక వదిలెయ్. జరిగింది చాలు' అన్నాడు మొగపెళ్ళివారిలోని మరో పెద్దమనిషి.

బంగారయ్య వుండబట్టలేక తిన్నగా పోలీసు స్టేషనుకి వెళ్ళాడు. రాత్రి సమయం కావడంతో సబిన్స్పెక్టరు లేడు. డ్యూటీలోవున్న కానిస్టేబిల్స్‌తో చెప్పుకున్నాడు జరిగిన విషయం.

ఆ కానిస్టేబిలు 'మీరు అమాయకుల్లా వున్నారు. పట్టాభిరామయ్యగారి మేనల్లుడు కొండలరావుమీద కేసా ? సాక్ష్యం ఎవరిస్తారయ్యా మీకు యీ వూళ్ళో ? అసలు ఆయన ఎవరని మీ అభిప్రాయం ? మా ఉద్యోగాలుపోయే ఏర్పాటు చేయకండి బాబూ–గుట్టుగా వెళ్ళి మరో సంబంధం చూసుకొని ఆ పిల్లకి మూడుముళ్ళూ వేయించండి. మీ మేలు కోరి చెబుతున్నాను' అన్నాడు.

విషయం బంగారయ్యకి అర్థమయింది. తన గోలంతా అరణ్యరోదనం అనుకున్నాడు. కాళ్ళీడ్చుకుంటూ సత్రవుకి తిరిగివచ్చాడు. అప్పటికీ అలా కుములుతూనేవున్న సుజాతను ఆవేశాన్ని దిగమింగుకోలేక "పొరుగూరు అయిపోయింది కాని కత్తెదైతే నరికిపారేద్దునే. పీడ విరగడైపోయేది. ఏ ముఖంపెట్టుకొని తిరిగి ఊళ్లోకి వెళ్ళాలే నేను. నిన్ను ఊళ్ళోకి ఏ ముఖంపెట్టుకొని తీసుకెళ్ళనే " అని కాలితో అన్నాడు. ఎవరో వచ్చి అడ్డుకున్నారు.

అంతా నిశ్శబ్దమైంది. సుజాత మనసు మాత్రం సముద్రంలా ఘోషిస్తోంది. ఇంతవరకూ ఆమె ఎన్నడూ ఆలోచించలేదు. అవసరమూ కలగలేదు. మొదటిసారిగా ఆలోచించడం మొదలుపెట్టింది. అందరూ అన్న మాటలు మెదడులో కుమ్మరిపురుగుల్లా దొలుస్తున్నాయి.

నవమాసాలూ మోసి కన్నతల్లి తన కడుపున చెడపుట్టావే–పుట్టగానే పోయినా బాగుండేదే అంది–కన్నతండ్రి ఏ ముఖం పెట్టుకొని తాను వూళ్ళోకి వెళ్ళాలీ–నన్ను ఏ ముఖంతో వూళ్లోకి తీసుకువెళ్ళాలీ అని కుమిలిపోతున్నాడు. మొగపెళ్ళివారు 'ఆ ముసలమ్మ మొక్కుమూలాన ఓ కులట మనింటి కోడలుకాకుండా ఆ దేవుడు కాపాడేడు' అని దేవుడ్ని మెచ్చుకుంటున్నారు.

ఇంతకీ తాను చేసిన తప్పేమిటి ? ఆ వచ్చిన వాడెవడో తనకి తెలీదు. వాడ్ని ఏమీ అనలేక అంతా తనమీద విరుచుకుపడుతున్నారు.

'నేను యీ దైవసన్నిధికి వచ్చేసరికి కులటను కాదు. ఓ కులట వారియింటి కోడలుగాకుండా కాపాడిన దేవుడు- ఆయన సన్నిధిలోనే నన్ను కులటనెందుకు చేసాడు. యీ అత్యాచారాన్ని తన సన్నిధిలోనే ఎందుకు జరగనిచ్చాడు ? బహుశా దేవుడిక్కడ లేడేమో, ఉన్నా నిద్రపోతున్నాడేమో- లేక దేవుడూ ఆ వ్యక్తికి వత్తాసేమో ! అనుకుంది సుజాత.

* * *




అంతామాగన్నుగా నిద్రపోతున్నారు. ఎవరోవచ్చి 'బంగారయ్యగారూ బంగారయ్యగారూ' అని పిలిచారు. ఆ పిలుపుకి అంతా వులిక్కిపడి లేచారు. శాంతమ్మ కళ్లు సుజాతకోసం వెతికాయి. కనుపించలేదు.

వచ్చినవాళ్ళు పోలీసు జవానులు.

'మా ఎస్.ఐ. గారు మిమ్మల్ని స్టేషనుకి రమ్మంటున్నారు' అని బంగారయ్యకి చెప్పారు వాళ్లు.

బంగారయ్య స్టేషనుకి వెళ్ళి ఏం ఘోరం చూడాల్సి వస్తుందోనని వణికిపోయాడు.

శాంతమ్మ 'నాతల్లి శవాన్నే చూడాలి కాబోలక్కడ నా తల్లి ఘనంగా బతికిన పిల్ల-మాటపడి ఎరుగదు' అని కుమిలి పోతోంది.

శాంతమ్మ, బంగారయ్య యిద్దరూ పోలీసు స్టేషనుకి వెళ్ళారు.

'నా తల్లి ఎక్కడ బాబూ' అంటూ శాంతమ్మ ఎస్.ఐ. దగ్గర కెళ్లబోతోంది.

'ఇక్కడమ్మా' అంది సుజాత కటకటాల వెనకనుంచి. బంగారయ్య, శాంతమ్మ కూడ నిశ్చేష్టులైపోయారు.

'అలా ఆశ్చర్యపోతారేం నాన్నా. నాకు తెలిసి నేను తప్పు చెయ్యలేదు. అయినా అందరూ నన్నే ఆడిపోసుకున్నారు. బలవంతంగా నన్ను ఎవరో ముక్కూ ముఖం తెలియని వాడు చెరిచాడు. మీ అందరికీ బరువై తలవంపులుతెచ్చి బతకడంకంటె అతని దగ్గరకే వెళ్ళి అతన్నే ఆశ్రయించడం మంచిదని వెళ్ళాను. మీరంతా నిద్రలో వున్నారు పేరుమోసిన పట్టాభిరామయ్య యిల్లు కాబట్టి తెలుసుకోవడం పెద్ద యిబ్బంది కాలేదు. వెళ్ళి, 'నన్ను మొట్ట మొదటిసారి అనుభవించింది నువ్వు. నన్ను పెళ్ళాడమని అడిగాను. అతను నవ్వి- 'ఇలా అగతగిలినవాళ్ళందరినీ పెళ్ళాడాలంటే రెండు మూడు వందల సంసారాలు పెట్టాలి నేను. నీ కొచ్చిన నష్టం ఏమీలేదుగా ని-చక్కని చుక్కలా వున్నావునాతో వుండిపో, యిల్లు చూసి పెడతాను' అన్నాడు.

'నా మెళ్లో తాళికట్టండి ముందు' అన్నాను ప్రాధేయపడుతూ. 'కావాలంటే నువ్వే కట్టుకో. నేను తాళి కట్టాల్సింది మా మావకూతురు మెళ్ళో మాత్రమే. నువ్వుండేదీ ఆ పెళ్ళి జరిగేదాకానే. ఆ తరువాత ఎవడో ఒకడు దొరక్కపోడు! నిమ్మపండులా వున్నావ్ నీకేం తక్కువా' అంటూ నోటికొచ్చినట్లు వాగాడు. ఒక్కమాటలో చెప్పాలంటే తనకు కావాల్సినన్నాళ్ళు నన్ను వుంచుకుంటానన్నాడు. మచ్చికగా దగ్గరకు చేరాను. మనసారా అతనే నా భర్త అనుకున్నాను ఆ క్షణాన. అదమరపుగా వున్నపుడు పళ్లుకోసే చాకుతో కసిగా శక్తికొద్దీ రెండుపోట్లు పొడిచాను. తిన్నగా పోలీసు స్టేషనుకివచ్చి చెప్పాను అతను పోయాడులే.

'అందుకే నుదిటి కుంకుమ చెరిపాను. గాజులు పగలకొట్టాను. ముండమోసాను.

'నాన్నా ! ఇంక నువ్వు తలెత్తుకుని వెళ్ళవచ్చు వూళ్లోకి. ఎవరేనా అడిగితే నా గురించి-అక్కడే పెళ్ళిచేసాం సుజాతకి-భర్త పోయాడు. ముండ మోసింది అని చెప్పు. నీ పరువుకి మచ్చరాదు. నే నెప్పుడేనా తిరిగి బయట కొస్తే, మనవూరు వస్తే, నీ కూతురుగా తలెత్తుకునే వస్తాను నాన్నా! నేను తప్పు చెయ్యలేదు. నీ కూతురు కులటకాదు. ఇది కొండమీద జరిగిన పెళ్ళి. ఇది కొండమీదే రాలిపోయిన కుంకుమ' అంది.